# వినూత్నంగా బీఆర్ఎస్ ప్రచారం

- ఆసక్తిగా గమనిస్తున్న పట్టణవాసులు
- సౌండ్, లౌడ్ స్పీకర్లు లేని ప్రచారం
- గల్లీగల్లీ తిరుగుతున్న రిక్షాలు




సంగారెడ్డి : రిక్షాతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్


సంగారెడ్డి, నవంబరు 4 : ఎన్నికల్లో భాగంగా రిక్షాలతో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం నిర్వహిస్తున్నారు. వినూత్నంగా బీఆర్ఎస్ ప్రచారం చేయడంతో పట్టణవాసులు, ప్రజలు ఆసక్తిగా గమనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు చింతా ప్రభాకర్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామంటున్నారు. ముఖ్యంగా సౌండ్, లౌడ్ స్పీకర్లు లేకుండా ప్రచారం చేయడంతో గులాబీ పార్టీపై ప్రజలకు నమ్మకం కలుగుతున్నది. పట్టణంలోని గల్లీగల్లీ తిరుగుతూ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫ్లెక్సిలతో రిక్షాకు మూడు వైపుల ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి చింతాప్రభాకర్ ఫోన్ చేయగానే పలుకుతారని, మిస్ కాల్ ఉంటే వెంటనే మళ్లి కాల్ చేసి సమస్యలు తెలుసుకునే మనస్తత్వం కలిగిన గొప్ప నాయకుడు ప్రభాకర్ అని ప్రజలు అన్నారు. రిక్షాతో ప్రచారమే ఒక మార్పుకు శ్రీకారం చుట్టనున్నదని పట్టణ వాసుల్లో చర్చ మొదలైంది.

**చింతా ప్రభాకర్ గెలువాలని పాదయాత్ర**

సదాశివపేట, నవంబర్ 4 : చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ అభ్యర్థి చింతాప్రభాకర్ గెలువాలని చింతా సాయినాథ్ యువసైన్యం గణేశ్‌గడ్డ వరకు పాదయాత్రగా వెళ్లారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చింతా సాయినాథ్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతా సాయినాథ్ మాట్లాడుతూ దేవుడి ఆశీస్సులు పొందడానికి గణేశ్‌గడ్డ వరకు యువసైన్యం పాదయాత్రగా బయలుదేరిందన్నారు. చింతాప్రభాకర్ అధికారం లేకున్నా గడపగడపకూ అభివృద్ధి ఫలాలు అందజేశారన్నారు. పాదయాత్రలో నాయకులు నరేందర్‌రెడ్డి, సురేశ్, చంద్రారెడ్డి, అశ్వీన్, రాజ్‌కుమార్, నరోత్తంరెడ్డి, నరేశ్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

**కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు**

గుమ్మడిదల, నవంబర్ 4 : మాయమాటలు చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసే కాంగ్రెస్, బీజేపీల నాయకుల మాటలు నమ్మొద్దని జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మండల సీనియర్ నాయకులు ఓటర్లను వేడుకున్నారు. శనివారం మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, గూడెం సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు దోమడుగు శంకర్, బానోత్ ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, పటాన్‌చెరు నియోజకవర్గ శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్, సోషల్‌మీడియా మండల అధ్యక్షుడు ఫయాజ్‌షరీఫ్, నక్క వెంకటేశ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గుండగళ్ల వెంకటేశ్ పాల్గొన్నారు.



గుమ్మడిదల : కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సదాశివపేట : యువసైన్యం పాదయాత్రను ప్రారంభిస్తున్న చింతా సాయినాథ్

## రిటర్నింగ్ ఆఫీస్‌ను సందర్శించిన పరిశీలకుడు

సంగారెడ్డి, నవంబరు 4: సార్వత్రికల ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అన్ని విభాగాలకు ఎన్నికల అబ్జర్వర్లను నియమించిన విషయం తెలిసిందే. శనివారం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన అబ్జర్వర్ కేపీ జయేకర్ సంగారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. అబ్జర్వర్‌కు మొక్క అందజేసి రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డి స్వాగతం పలికారు. అబ్జర్వర్‌గా వచ్చిన అధికారి ఎన్నికల నామినేషన్లకు ఏర్పాటు చేసిన వసతులపై రిటర్నింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఈఓలతో సమావేశం నిర్వహించి ముఖాముఖి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో డీఏవో బొమ్మ రాములు, గిర్దావర్ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.



ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించిన అబ్జర్వర్ కేపీ జయేకర్

## పిల్లల కోసం 'తొలిమెట్టు'

**తారా ప్రభుత్వ కళాశాలలో ఒక రోజు వర్క్‌షాప్**

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 4: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమమే పిల్లల కోసం తొలిమెట్టు అని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. శనివారం తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పిల్లల కోసం తెలిమెట్టు కార్యక్రమంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రాథమిక విద్యాలయాల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించి హాజరును పెంచేందుకు, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కనీస అవగాహన నైపుణ్యాలను నేర్పించేందేకు, ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో భాగం గా 160మంది డిగ్రీ విద్యార్థులు ప్రతి శనివారం జిల్లాలో కేటాయించబడిన ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యా బోధన చేస్తారని తెలిపారు. కార్యక్రమం లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ అభిజిత్, శివదీప్తి పాల్గొన్నారు.



పిల్లల కోసం తెలిమెట్టు వర్క్‌షాప్‌లో పాల్గొన్న డిగ్రీ విద్యార్థులు

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

జిన్నారం, నవంబర్ 4: ఖాజీపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 181 ప్రభుత్వ భూమిలో రెండు చోట్ల నిర్మించిన అక్రమ కట్టడాలను ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ శనివారం కూల్చి వేశారు. సర్వే నంబర్ 181లో అక్రమంగా నిర్మాణాలు జరగడంపై గ్రామస్తుల నుంచి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు వచ్చాయని, తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేసినట్లు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ తెలిపారు. నిర్మాణాలకు తీసిన పునాదులను పూడ్చి చేశామని, మరో చోట నిర్మించిన కట్టడాలను జేసీబీతో నేలమట్టం చేశామన్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తే చట్ట ప్రకారం పోలీసు కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.



నిర్మాణాల కోసం తీసిన పునాదులను జేసీబీతో పూడ్చేస్తున్న ఆర్ఐ

## ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

జిన్నారం, నవంబర్ 4 : మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రూపేరావు శ్రీనివాస్ ఆయన అనుచరులు పది మందికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్ర భాకర్, పార్టీ రాష్ట్ర నాయకుడు వెంకటేశం గౌడ్, మంగంపేట సర్పంచ్ ప్రశాంతినరేందర్, పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్, ఉపసర్పంచ్ నక్క నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు రూపేరావు శ్రీనివాస్




కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి

## బీఆర్ఎస్‌కు తిరుగులేదు

అమీన్‌పూర్, నవంబర్ 4: సీఎం కేసీఆర్ అభివృద్ధి వల్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటారని అమీన్‌పూర్ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌పూర్, దయారా, గండిగూడెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కి ఊహించని విధంగా ఆదరణ లభిస్తుందన్నారు. ఆయన వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సునీత సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు కృష్ణ, మల్లేశ్, పాండు యాదవ్, నర్సమ్మ, భాస్కర్‌గౌడ్, ఉప సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

రామచంద్రాపురం, నవంబర్ 4: మంత్రి కేటీఆర్ బహిరంగసభ మియాపూర్ నరేన్‌గార్డెన్స్‌లో జరిగింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీనగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ నుంచి కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న సభకు తరలివెళ్లారు. ఓల్డ్ ఎంఐజీలో జై కేసీఆర్, జై కేటీఆర్, జై హరీశ్‌రావు నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓల్డ్ ఎంఐజీలో బీఆర్ఎస్ పటిష్టంగా ఉన్నదని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అరికపూడి గాంధీకి ఓల్డ్ ఎంఐజీ నుంచి భారీ స్థాయిలో ఓట్లు వేయించి గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గౌడ్, భాస్కర్, వెంకట్‌రావు, నాగమణి, జ్యోతి, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.



ఓల్డ్ ఎంఐజీ నుంచి మంత్రి కేటీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు